క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న ఆలయంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని పండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ దాపర్తి సీతారామయ్య, పాలచర్ల సత్యనారాయణ, ఒబిణ్ని సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పి.వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గంజాయి తరలిస్తున్న స్కూటీకి ప్రమాదం

ఇద్దరికి తీవ్ర గాయాలు

గోకవరం: గంజాయి తరలిస్తున్న స్కూటీ ప్రమాదానికి గురైన ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గోకవరంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా కంకిపాడు మండలం మదుసువారిపాలెం గ్రామానికి చెందిన జి.జ్యోతి ప్రకాష్, ఉయ్యూరు గ్రామానికి చెందిన బి.ప్రతాప్ స్కూటీపై రంపచోడవరం వైపు నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా గోకవరం శివారున మలుపులో ఎదురుగా వస్తున్న కారుని ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై పవన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారిస్తుండగా వీరు గంజాయి తరలిస్తున్నట్టుగా గుర్తించారు. వీరి వద్ద నుంచి 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని గాయపడిన ఇద్దరినీ 108 వాహనంలో వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన ఇద్దరు వ్యక్తులు దారకొండ ప్రాంతం నుంచి విజయవాడ గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. వీరిపై గతంలోనూ పలు గంజాయి కేసులు ఉన్నట్టు భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కిర్లంపూడి: మండలంలోని వీరవరం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ వీరభద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వీరవరం, కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నేటి నుంచి సువార్త సభలు

గోకవరం: కృష్ణునిపాలెం ఈహెచ్‌హెచ్ పరిశుద్ధ దేవాలయంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సువార్త సభలు నిర్వహించనున్నట్టు సంఘ కాపరి, పాస్టర్ జుహాని హాలోనెన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు సభలు ప్రారంభమవుతాయని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విశ్వాసులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఖరీఫ్‌కు తెగుళ్ల బెడద

- వరి పంటను ఆశిస్తున్న ఆకుముడత, ఎండాకు తెగుళ్లు
- ఆందోళన చెందుతున్న రైతులు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



గోకవరంలో సాగు చేస్తున్న వరి పంట

గోకవరం: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు ఆటుపోట్ల నడుమ సాగుతోంది. గత కొన్నేళ్లుగా పంట చేతికొచ్చే సమయానికి ప్రతికూల వాతావరణం కారణంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సాగుపై భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురవడంతో రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు చేపట్టారు. వరుస తుపానులతో ప్రాజెక్టుల్లో వరదనీరు చేరడంతో దిగువ ప్రాంతాలకు వరదనీటిని విడుదల చేసే క్రమంలో కిర్లంపూడి మండలంలో వేలాది ఎకరాలు, జగ్గంపేట, గోకవరం మండలాల్లో వందలాది ఎకరాల్లో పంట నీటమునిగి పూర్తిగా దెబ్బతింది. మిగిలిన పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉండగా మళ్లీ వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

20 వేలు హెక్టార్లలో సాగు

నియోజకవర్గంలో జగ్గంపేట, కిర్లంపూడి, గోకవరం, గండేపల్లి మండలాల్లో సుమారు 20 వేల హెక్టార్లలో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. మెట్టలో ఎక్కువగా వర్షాధారంపై ఆధారపడి రైతులు సాగు చేస్తారు. ప్రారంభంలో వర్షాభావం కారణంగా సాగులో ఇబ్బందులు ఎదురయ్యాయి. తరువాత వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగు సక్రమంగా సాగింది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలతో కాలువలు, చెరువులు పొంగి పొర్లడంతో పొలాల్లోకి భారీగా నీరు చేరింది. ఈ కారణంగా ఆకుముడత, ఎండాకు తెగుళ్లు ఆశించాయి. ఇప్పటివరకూ రైతులు ఎకరాకు రూ.20 వేలు వరకు పెట్టుబడులు పెట్టారు. తుపాను హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంటను కాపాడుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలు పడితే పొలంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గోకవరం మండలంలో ఆకుముడత, ఎండాకు తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉందని ఏఓ రాజరాజేశ్వరి తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నియోజకవర్గంలో వరి పంట అంకురం ఏర్పడే దశలో ఉంది. ప్రస్తుత వాతావరణంలో పంటను ఆకుముడత, కాండం తొలుచు పురుగులు ఆశిస్తున్నట్టు గుర్తించాం. వీటి నివారణకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ మందును ఎకరాకు 400 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారీ చేసుకోవాలి. అలాగే క్లోరంట్రినిలిప్రోల్ మందును లీటర్‌కు 80 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలి. వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు వరిలో దోమ ఉధృతి పెరుగుతుంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ మందును ఎకరాకు 50 ఎంఎల్, ఎకరానికి పైమెట్రోజిన్ 120 గ్రాములు మందును లేదా డైనోటిఫ్యూరన్ మందును ఎకరాకు 60 నుంచి 80 గ్రాములు పిచికారీ చేయాలి. సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా వరి పంటను కాపాడుకోవచ్చు.

– ఎ.రాజరాజేశ్వరి, ఏఓ, గోకవరం

ఆరు ఎకరాలు సాగు చేస్తున్నా



ఖరీఫ్‌లో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం పంటను తెగుళ్లు ఆశించాయి. దీనికి తోడు మళ్లీ తుపాను హెచ్చరికలు కలవర పెడుతున్నాయి. భారీ వర్షాలు కురిస్తే పంటకు నష్టం వాటిల్లుతుంది.

– కొరిపల్లి అప్పలస్వామి, కౌలురైతు, గోకవరం

గౌరీదేవి ఉత్సవాలు ప్రారంభం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకరుల (గౌరీదేవి) ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గౌరీదేవి పుట్టిల్లుగా భావించే జువ్వల వారి పొలం నుంచి వరి దుబ్బులు ఆలయానికి తీసుకువచ్చి ఉత్సవాలను ప్రారంభించారు. కాగా సంక్రాంతి వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక కళాకారులు వీధి నాటకాలు ప్రదర్శిస్తారు.

రావులమ్మతల్లికి వెండి గరగ సమర్పణ

జగ్గంపేట: స్థానిక ప్రజల ఆరాధ్యదైవం రావులమ్మ తల్లికి ఆలయ కమిటీ వెండి గరగను తయారు చేయించింది. కాగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఆయన సతీమణి గరగకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నెహ్రూ దంపతులు గరగను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి పునర్నిర్మించాలంటూ ఆందోళన



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న వినోద్ మిశ్రా పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: ఏలేశ్వరం నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే పునర్నిర్మించాలని కోరుతూ పట్టణంలో ఆదివారం ఆందోళన చేశారు. సీపీఐ (ఎంఎల్)వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక వినోద్ మిశ్రా నగర్‌లో కర పత్రాలు ప్రదర్శిస్తూ ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రహదారిపై రాద్ధాంతం చేసిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఈ రోడ్డును పట్టించుకోలేదన్నారు. దీంతో రహదారి పునర్నిర్మాణంపై తమ పార్టీ తరపున కరపత్రాలు ముద్రించామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రహదారిపై గోడ నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కందుల కుమార్, పందిరి సుబ్బారావు, బాలయ్య, ధర్మరాజు, గూనాపు వరలక్ష్మి, గుర్రం నాగేశ్వరి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా నిమజ్జనాల సందడి

- కన్నులపండువగా అమ్మవారి నిమజ్జనోత్సవాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



తుని మండలం తేటగుంటలో అమ్మవారి శోభాయాత్ర



ఏలేశ్వరంలో అమ్మవారి ఊరేగింపు

ఏలేశ్వరం: దేవీ శరన్నవరాత్రులు ముగియడంతో ఆదివారం అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా పలు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి ఏలేరు కాలువలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. పట్టణంలోని తోట వీధి, లింగవరంకాలనీల్లోని అమ్మవారి విగ్రహాలను మెయిన్ రోడ్, బాలాజీ చౌక్, దిబ్బలపాలెం, మార్కెట్ వీధి, పల్లపు వీధి మీదుగా ఊరేగించి ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భారీ ఎత్తున బాణాసంచా ఏర్పాటు చేశారు. ఊరేగింపులో మహిళలు, యువకులు సందడి చేశారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, శంఖవరం, జి.కొత్తపల్లి, గౌరంపేట గ్రామాల్లో కనకదుర్గమ్మ విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. నవరాత్రులు ముగియడంతో అమ్మవారిని మేళ తాళాలు, బాణాసంచా కాల్పుల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు.

తుని: పట్టణంలో ఆదివారం కనకదుర్గమ్మ విగ్రహాల నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారి విగ్రహాలను వాహనాల్లో ఉంచి ఊరేగింపుగా తీసుకువెళ్లి నదులు, చెరువులు, కాలవల్లో నిమజ్జనం చేశారు. లోవ దేవస్థానంతో పాటు గ్రామ దేవతల ఆలయాల్లో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం నుంచి సెలవులు ముగియడంతో బంధువులు సొంతూళ్లకు పయనమయ్యారు.

ఆకట్టుకున్న శోభాయాత్ర

తుని: దేవి నవరాత్రులు ముగింపు సందర్భంగా తుని మండలం తేటగుంటలో నిర్వహించిన శోభాయాత్ర అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం తేటగుంటలో విజయదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కన్నుల పండువగా శోభాయాత్ర నిర్వహించారు. చిన్నారులు కోలాటం, తీన్‌మార్‌తో ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు శోభాయాత్రలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గంగమ్మ ఒడికి దుర్గమ్మ

ప్రత్తిపాడు: శరన్నవరాత్రులు ముగియడంతో దుర్గమ్మ విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ సమీపంలో ప్రతిష్ఠించిన కనకదుర్గ అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఆశీనులను గావించి మేళతాళాలు, బాణాసంచా కాల్పుల నడుమ ఊరేగించారు. స్థానిక పుష్కర కాలువలో ఘనంగా నిమజ్జనం చేశారు.

ఘనంగా రావణ దహనం

అన్నవరం: విజయదశమిని పురస్కరించుకుని శనివారం రాత్రి స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో రావణ దహనం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని వెండి గజవాహనంపై ఊరేగింపుగా జూనియర్ కళాశాల మైదానం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పూజలు చేసి రావణ దహనం నిర్వహించారు. బాణసంచాతో రూపొందించిన సుమారు 30 అడుగుల ఎత్తు గల రావణబ్రహ్మ విగ్రహానికి తలుపులమ్మ దేవస్థానం ఈఓ పి.విశ్వనాథరాజు బాణం వేశారు. దీంతో విగ్రహం నిమిషాల వ్యవధిలో రంగు రంగుల వెలుగులు జిమ్ముతూ కాలిపోయింది. వేలాది మంది భక్తులు పాల్గొని రావణ దహనాన్ని ఆసక్తిగా తిలకించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహనరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామకృష్ణ, డీఈ రాంబాబు, ఉదయ్ ఇతర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శంఖవరంలో కనకదుర్గమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



బాణం వేసి రావణ దహనాన్ని ప్రారంభిస్తున్న లోవ ఈఓ విశ్వనాథరాజు



బాణసంచా వెలుగుల్లో రావణబ్రహ్మ

నేటి నుంచి పల్లె పండగ

రౌతులపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో సోమవారం నుంచి ఈ నెల 21 వరకూ పల్లె పండగ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.శివరామకృష్ణయ్య ఆదివారం తెలిపారు. సోమవారం దిగువశివాడు, గంగవరం, ఎం.కొత్తూరు, బలరామపురం, 17న రాఘవపట్నం, జల్దాం, ఎస్.పైడిపాల, గుమ్మరేగుల, 21న ఎస్ఎన్ పట్నం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం, పారుపాక గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

మద్యం సీసాల స్వాధీనం

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరంలో కిరాణా షాపుపై శనివారం సాయంత్రం పోలీసులు దాడి చేసి 23 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కథనం మేరకు మండలంలోని ధర్మవరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో విక్రయిస్తున్న 23 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దుకాణం యజమాని ఉయ్యూరి వీరబాబును అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం తెలిపారు.

జై జయహే జగన్మాత

- రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ముగిసిన దసరా ఉత్సవాలు



రామచంద్రపురంలో రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



గోకవరంలో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న దేవీచౌక్ కనకదుర్గమ్మ

తుని: శరన్నవరాత్ర ఉత్సవాలు శనివారంతో అట్టహాసంగా ముగిశాయి. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని గ్రామాలు, పట్టణాల్లో విజయదశమి వేడుకలు కన్నులపండువగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు కనకదుర్గ అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తుని పట్టణంలో శనివారం అమ్మవారికి శమీపూజ (జమ్మిచెట్టుకు పూజ) చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భవానీ భక్తులు విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానానికి వెళ్లి మొక్కులు సమర్పించారు.

గోకవరం: దసరా ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజైన శనివారం గోకవరం దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమివ్వగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పండితులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి నివేదించిన లడ్డూకు డ్రా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు వేలం జరిపారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా శనివారం విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి అమ్మవారి ఆలయాలకు మహిళలు పోటెత్తారు. ఏలేశ్వరంలో తోటవీధిలో అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల వద్ద మహిళలకు రవికలు, గాజులు, పసుపు కుంకుమలు పంపిణీ చేశారు. శరన్నవరాత్రులు ముగియడంతో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు కమిటీ సభ్యులు రెడీ అయ్యారు.



ఏలేశ్వరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న యువకులు

ముగిసిన ఉత్సవాలు

ప్రత్తిపాడు: దసరా ఉత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. 10 రోజుల పాటు ప్రత్తిపాడు మండలంలోని దుర్గమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం రాత్రి శమీ పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తేజోమూర్తుల వీరభద్రప్రసాద్, తాతా సాంబు, పంచాయతీ కార్యదర్శి రామరాజువర్మ, కొమ్ముల ఆనంద్ పాల్గొన్నారు.

తొండంగి: మండలంలో పది రోజుల పాటు వైభవంగా నిర్వహించిన దసరా ఉత్సవాలు ముగిశాయి. తొండంగి దుర్గామాత, గోపాలపట్నం నేరేళ్లమ్మ, రావికంపాడు మహిషాసురమర్దిని, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, వేమవరం, ఏవీ నగరం గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా చివరి రోజు గోపాలపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో పది వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

కిర్లంపూడి: శరన్నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. జగపతినగరం అభయ దుర్గమ్మ, రామచంద్రపురం కనకదుర్గమ్మ, కిర్లంపూడి వాసవీ కన్యకా పరమేశ్వరి, వీరవరం, చిల్లంగి, బూరుగుపూడి, కృష్ణవరం, సోమవరం, సోమరాయణంపేట, ముక్కొల్లు, గోనేడ గ్రామాల్లోని కనకదుర్గమ్మ అమ్మవార్లు చివరి రోజు శనివారం రాజరాజేశ్వరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలు వద్ద సాయంత్రం శమీపూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉప్పంపాలెంలో వ్యక్తిపై దాడి

రౌతులపూడి: మండలంలోని ఉప్పంపాలెంలో వేగిశెట్టి సూర్యకృష్ణారావు అలియాస్ ఒక్క మగాడు అనే వ్యక్తిపై ఆదివారం ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే...కాకినాడ మండలం తూరంగి గ్రామానికి చెందిన సూర్య కృష్ణారావు రౌతులపూడి మండలం ఉప్పంపాలెంలో ఉన్న తన పొలంలో పని చేసుకుంటుండగా రౌతులపూడికి చెందిన లింగం గంగాధర్, ఉప్పంపాలెం గ్రామానికి చెందిన బచ్చా ఎర్రయ్య ఈ పొలం మాది అంటూ ఘర్షణ పడి కృష్ణారావుపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

టీడీపీ నాయకుడి తోటలో కోడి పందేలు

తొమ్మిది మంది అరెస్ట్

తుని: మండలంలోని తేటగుంటలో టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ జి.అప్పలరాజుకు చెందిన తోటలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్టు తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు తెలిపారు. శనివారం దసరా పండగను పురస్కరించుకొని తేటగుంటలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు దాడి చేశామన్నారు. కోడి పందేలాడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4200, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అద్భుతం.. అపురూపం



పెంకే కృష్ణస్వామి

గండేపల్లి: రావి ఆకుపైన, పెన్సిల్‌తోనూ అమ్మవారి చిత్రాన్ని గీసి తన భక్తిని చాటుకున్నాడు ఆ కళాకారుడు. ద్రాక్షారామానికి చెందిన పెంకే కృష్ణస్వామి మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. విజయదశమి సందర్భంగా అమ్మవారిపై తనకున్న భక్తిభావాన్ని చిత్రీకరణ ద్వారా చాటుకున్నాడు. సుమారు రెండు గంటల వ్యవధిలో రావి ఆకుపైనా, గంట వ్యవధిలో పేపర్ పైన పెన్సిల్‌తో అమ్మవారి రూపాన్ని చిత్రీకరించాడు. ఈ చిత్రాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. గతంలో ఇతను పలు దైవ రూపాలు, దేశ నాయకుల చిత్రపటాలను గీసి అందరి మన్ననలు పొందాడు.



రావి ఆకుపై అమ్మవారి రూపం



స్కెచ్‌తో గీసిన అమ్మవారి రూపం

ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరని లోటు

గోకవరం/జగ్గంపేట: మానవ హక్కుల నేత, ప్రముఖ రచయిత, ప్రజా ఉద్యమకారుడు ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటు అని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. గోకవరం మండలం రంపయర్రంపాలెం, జగ్గంపేట మండలం రంగవల్లి నగర్‌లో ఆదివారం ఏపీఆర్‌పీఎస్, ఏఐఎఫ్‌టీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాయిబాబా సంతాప సభలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రంగవల్లి నగర్‌లో ఆయన మృతికి సంతాపంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా ప్రజల పక్షాన నిలిచిన నేరానికి అర్బన్ నక్సలైటుగా, మావోయిస్టు యాక్టివిస్టుగా ముద్ర వేయబడి పదేళ్ల జైలు శిక్షలు అనుభవించి అనారోగ్యం పాలయ్యారన్నారు. 90 శాతం అంగవైకల్యంతో అమలాపురం నుంచి హైదరాబాదుకు అక్కడి నుంచి ఢిల్లీ యూనివర్సిటీ వరకూ ప్రజా ఉద్యమాల ద్వారా ఆయన సాగించిన పయనం ఎంతోమందికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కుంచె అంజిబాబు, గోలి మునలయ్య, కొత్తల అప్పారావు, అల్లాడ అబ్బులు, గడ్డం చంద్రమ్మ, నక్క వీర రాఘవ, వడ్లపాటి చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



రంగవల్లి నగరంలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 2003–2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో కలయ తిరిగారు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల ఆవరణలో స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.



కిర్లంపూడి సుమారు 20 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు